ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు
5
సోమవారం 14 జులై 2025

కన్నీటి ఖరీఫ్!



- తక్కువ వర్షపాతంతో చతికిలపడ్డ సాగు
- ఇప్పటికీ 30 శాతమే..
- అడుగంటిన భూగర్భజలాలు
- నిరాశలో రైతులు

చాగలమర్రి/ కొలిమిగుండ్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఖరీఫ్ సాగు మందకొడిగా సాగుతోంది. సీజన్ ప్రారంభమై ఇప్పటికే నెల రోజులు దాటినా 30 శాతం మాత్రమే పంటలు సాగయ్యాయి. అధికారులు 2.37 లక్షల హెక్టార్లు సాగు లక్ష్యంగా ఎంచుకున్నారు. జూన్ 10న ఖరీఫ్ సాగు ప్రారంభమైనప్పటికీ తగిన వర్షపాతం నమోదు కాలేదు. మే నెలలో సాధారణ వర్షపాతం 182 ఎంఎం ఉండగా 390 ఎంఎం వర్షపాతం నమోదైంది. జూన్ నెలలో 79.1 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 22.5 మి.మీ మాత్రమే నమోదైంది. ఇక జూలై సాధారణ వర్షపాతం 142ఎంఎం కాగా, ఇప్పటివరకు 40 మి.మీ వర్షపాతం కురిసింది. దీంతో పంటలు వాడుముఖం పట్టాయి.

2.37 లక్షల హెక్టార్ల సాగు లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే లక్షకు పైగా హెక్టార్లలో రైతులు వర్షాధారంగా సాగు చేశారు. ఖరీఫ్ సీజన్‌లో 2.37 లక్షల హెక్టార్లు పంట సాగు లక్ష్యం కాగా ఇప్పటి వరకు కేవలం 30 శాతం మాత్రమే పలు రకాల పంటలు సాగయ్యాయి. నంద్యాల జిల్లాలో మొక్కజొన్న 45,898, కంది 37,531, మిరప 9,600, వరి 70,528, మినుము 10,700, కొర్ర 1,500, పెసర 700, ఇతర పంటలు 1,10,300 హెక్టార్లలో పంటలు సాగు చేయాల్సి ఉంది. ఇవిగాక ఉద్యానవన పంటలు, ఇతర పంటలు సాగవుతాయి. వివిధ మండలాల్లో ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న సాగుచేశారు. వానల్లేక మొక్కజొన్న వాడుముఖం పట్టింది. 10, 15 రోజుల్లో వర్షం కురిస్తేనే పంటలకు ఊపిరి వస్తుందని రైతులు అంటున్నారు.



ముత్యాలపాడులో నీరు లేక ఒట్టిపోయిన చెరువు

కనిపించని వాన జాడ..

ఏప్రిల్, మే నెలలను తలదన్నేలా జూలైలో కూడా ఎండలు భగభగమంటున్నాయి. ఈ ఏడాది మే నెలలో ముందస్తు వర్షాలు కురవడంతో ముందుగానే రైతులు ఖరీఫ్ సీజన్ ప్రారంభించి పంటలు సాగు చేయడం విశేషం. జూన్‌లో అడపాదడపా కురిసిన వర్షాలకు రైతులు దుక్కులు దున్ని విత్తనాలు వేసేందుకు సిద్ధమయ్యారు. బోర్ల కింద మాత్రమే అక్కడక్కడ మొక్కజొన్న, పత్తి, మినుము, వేరుశనగ, జీలుగలు, వరి నారుమళ్లు సాగు చేశారు.

వర్షాలు కురిసి ఉంటే



చాగలమర్రిలో వాడిపోయిన మొక్కజొన్న పంట

ఈపాటికి వర్షాలు సంవృద్ధిగా కురిసి ఉంటే వ్యవసాయ పనులతో రైతులు బిజీగా ఉండేవారు. బోర్ల కింద నారు పోసుకొని జూలై మొదటి వారం నుంచి వరి నాట్లు వేసేందుకు సిద్ధమయ్యేవారు. అయితే కొన్నిచోట్ల బోర్లలో కూడా నీరు తగ్గిపోవడంతో రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. కొందరు మాత్రం వానలు రాకపోతాయా అని నారుమళ్లు సిద్ధం చేస్తున్నారు.

వర్షం కోసం ఎదురు చూపు



రెండెకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగుచేశా. పంట ఏపుగా పెరిగింది. వర్షాలు కురవకపోవడంతో బోర్లలో అనుకున్నంత నీరు రావడం లేదు. పంట వాడుముఖం పడుతోంది. వాన కోసం ఎదురు చూస్తున్నా.

- బషీర్, కౌలు రైతు, చాగలమర్రి

వర్షాలు కురవకపోతే అప్పులపాలే



వర్షాలు కురవకపోతే పంటలు సాగు చేయడం కష్టం. నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. రెండు నెలలైనా సరైన వర్షం కురవలేదు. ఇలాగైతే అప్పుల పాలైనట్లే.

- ఉసేన్‌బాషా, రైతు, చాగలమర్రి



కొలిమిగుండ్లలో సాగుచేసిన మొక్కజొన్న



మదనంతపురంలో సాగు చేసిన అరటి

జిల్లాలో జూన్ 10 నుంచి అక్టోబరు 10 వరకు నాలుగు నెలల పాటు సాగే ఖరీఫ్ సీజన్. ప్రారంభమై ఇప్పటికి 30 రోజులు గడచినా కేవలం 30 శాతం మాత్రమే పంటలు సాగయ్యాయి. మరో 90 రోజుల్లో ఖరీఫ్ కాలం ముగుస్తుండటంతో మిగిలి ఉన్న రెండు లక్షల హెక్టార్ల సాగు లక్ష్యం అధికారులను కలవరపెడుతోంది. ఈ ఏడాది వానలు రావాల్సిన సమయంలో రాకపోగా ఎండలు అధికమయ్యాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో రైతుల ఆశలు ఆవిరైపోతున్నాయి. సాగుకు అనుకూలమైన వర్షాలు లేక పోవడంతో సాగు చతికిలపడింది.

సబ్ డివిజన్‌లో బోర్లు

ఆళ్లగడ్డ డివిజన్ పరిధిలోని చాగలమర్రి మండలంలో 3,700, శిరివెళ్ల మండలం 2,800, రుద్రవరం మండలంలో 4,700 బోరు బావులు ఉన్నాయి. సబ్ డివిజన్ పరిధిలో అధికారికంగా 12,700 బోర్లు ఉన్నాయి. అనధికారికంగా మరో 1,500 పైగా బోరు బావులు ఉంటాయని అంచనా. వర్షభావ పరిస్థితుల్లో ఇప్పటికే సుమారు 5 వేల బోర్లలో నీరు తగ్గుముఖం పట్టగా మరో 2 వేల బోర్లు అడుగంటినట్లు తెలుస్తోంది. టీజీపీ, కేసీ కాలువలకు నీరు వస్తే భూగర్భజలాలు పెరుగుతాయి.



వర్షాలు కురిస్తే లక్ష్యాన్ని సాధిస్తాం



వర్షాలు కురిస్తే ఖరీఫ్ లక్ష్యాన్ని సాధించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ఇంకా ఉంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- రంగ నేతాజీ, ఏవో, చాగలమర్రి



కేసీ కెనాల్‌కు పూజలు చేసి నీటిని విడుదల చేస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు దస్తగిరి, జయసూర్య

తీరనున్న సాగు కష్టాలు

- శ్రీశైలం, తుంగభద్రలకు ఉరకలేస్తున్న వరద
- కాలువలకు సాగునీరు విడుదల

కర్నూలు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కరువు సీమ రైతుల్లో సాగు కష్టాలు తీరనున్నాయి. తుంగభద్ర, శ్రీశైలం జలాశయాలకు వరద పోటెత్తింది. ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతుంది. పంట కాలువల గేట్లు ఎత్తి సాగునీరు విడుదల చేస్తున్నారు. ఇప్పటికే తుంగభద్ర డ్యాం నుంచి టీబీపీ ఎల్లెల్సీకి నీటిని వదిలారు. ఆదివారం సుంకేసుల బ్యారేజీ నుంచి కేసీ కాలువకు నీటిని విడుదల చేశారు. హంద్రీ నీవా కాలువకు ఈ నెల 15 నుంచి కృష్ణా జలాలు ఎత్తిపోసేందుకు ఇంజనీర్లు సన్నాహాలు చేస్తున్నారు. జలాశయాలు దాటి.. కాలువల్లో చేరిన నీరు ఆయకట్టు వైపు అడుగులు వేస్తున్నాయి. వరినాట్లుతో పాటు వివిధ పంటల సాగుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. కరువు రైతుల మోమున సాగు ఆశలు వికసిస్తున్నాయి.

జిల్లా పశ్చిమ ప్రాంతం ప్రధాన నీటి వనరు తుంగభద్ర ఎల్లెల్సీ కాలువ. ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల్లో ఖరీఫ్‌లో 43,515 ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి. ఇటీవల జరిగిన ఐఏబీ సమావేశంలో 35వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని నిర్ణయం తీసుకున్నారు. సీమ రైతుల జీవనాడి తుంగభద్ర జలాశయానికి వరద పోటెత్తుతుంది. 1625.32 అడుగుల లెవల్‌లో 77.54 టీఎంసీలు నిల్వ చేశారు. ఎగువ నుంచి 42,844 క్యూసెక్కులు వరద వచ్చి చేరుతుంది. 35వేల క్యూసెక్కులు నదికి విడుదల చేశారు. అదే క్రమంలో తుంగభద్ర దిగువ కాలువకు 2,500 క్యూసెక్కులు విడుదల చేయగా..

మిగతా 7లో..

గల్లంతైన యువకుల మృతి 7

తెలుగు భాషను పరిరక్షించుకుందాం
- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

కాల్వలోకి దూసుకెళ్లిన ఆయిల్ ట్యాంకర్ 7

సంగమేశ్వర క్షేత్రానికి నదీజలాల శోభ

- ఎగువ పుష్కర ఘాట్‌ను ముంచెత్తుతున్న వరద
- ఉమామహేశ్వరాలయానికి చేరువలో జలాలు
- సందర్శకుల తాకిడి

ఆత్మకూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): సంగమేశ్వర క్షేత్రం నదీజలాలతో శోభను సంతరించుకుంది. కృష్ణ, వేణి, తుంగ, భద్ర, మలాపహరణి, భీమరథి, భవనాసి అనే ఏడు నదులు పవిత్ర సంగమ ప్రదేశంలో వెలసిన సంగమేశ్వర క్షేత్రం ఇప్పటికే జలాధివాసమైంది. ఎగువ రాష్ట్రాల్లోని ప్రాజెక్టుల నుంచి శ్రీశైల జలాశయానికి భారీగా వరద వస్తోంది. సంగమేశ్వరంలోని ఎగువ పుష్కరఘాట్‌ను నదీజలాలు ముంచెత్తుతున్నాయి. ఆదివారం సాయంత్రానికి శ్రీశైల జలాశయంలోకి ఎగువ జూరాల, సుంకేసుల నుంచి 73,586 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులకు గానూ 883.30అడుగులకు చేరుకుంది. గరిష్ఠ నీటిసామర్థ్యం 215.807 టీఎంసీలకు గానూ 206.0996 టీఎంసీలు నమోదయ్యాయి. సంగమేశ్వరాలయంలోని ఎగువ పుష్కరఘాట్ మెట్లను నదీజలాలు ముంచెత్తడంతో ప్రస్తుతం చివరి మెట్టు మాత్రమే కనిపిస్తోంది. ఎగువన ఉన్న ఉమామహేశ్వరాలయానికి అతిచేరువకు జలాలు వచ్చి చేరుతున్నాయి. కపిలేశ్వరం నుంచి సంగమేశ్వరానికి చేరుకునే రహదారి పక్కనే వున్న నదీతీరం వరకు జలాలు వచ్చిచేరాయి. దీంతో నదీజలాల సవ్వడులతో తొణికిసలాడుతున్న కృష్ణానది పరవళ్లను వీక్షించేందుకు సందర్శకులు సంగమేశ్వరానికి తరలివస్తున్నారు.





సంగమేశ్వర క్షేత్ర తీరానికి చేరిన వరదజలాలు



ఎగువ పుష్కరఘాట్లను ముంచెత్తుతున్న వరదజలాలు



జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప కుటుంబ సభ్యులకు స్వాగతం పలుకుతున్న ప్రధాన అర్చకుడు

అహోబిలేశుడి సన్నిధిలో హైకోర్టు జడ్జి

ఆళ్లగడ్డ, జూలై 13(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా అహోబిలం లక్ష్మీనరసింహస్వామిని ఆదివారం హైకోర్టు జడ్జి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా అహోబిలం చేరుకున్న కుటుంబ సభ్యులకు జూనియర్ సివిల్ న్యాయాధికారి భాస్కర్, ఆళ్లగడ్డ తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఆలయం వద్దకు చేరుకున్న వీరికి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాల స్వామి, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. జడ్జి కుటుంబ సభ్యులు ఎగువ అహోబిలంలో నరసింహస్వామి, చెంచు లక్ష్మి అమ్మవార్లను, దిగువ అహోబిలంలో ప్రహ్లాద వరదస్వామి, అమృతవల్లి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ప్రధాన అర్చకులు న్యాయమూర్తి కుటుంబ సభ్యులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. దర్శనం అనంతరం అహోబిలం అతిథి గృహానికి చేరుకున్నారు. డీఎస్పీ ప్రమోద్ న్యాయమూర్తిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. శిరివెళ్ల సీఐ దస్తగిరిబాబు, ఎస్ఐ వరప్రసాద్ ఉన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌తో పాటు అన్నిమండల, డివిజన్, మున్సిపల్ కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని వివరించారు. అర్జీదారులు కలెక్టరేట్‌కు వచ్చే అవసరం లేకుండా మీకు సమీపంలోని మండల, డివిజన్ కార్యాలయాల్లో కూడా దరఖాస్తులను అందజేయవచ్చని పేర్కొన్నారు. పీజీఆర్ఎస్ కార్యక్రమానికి అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు



దర్శనానికి క్యూలో వెళ్తున్న భక్తులు

నంద్యాల ఎడ్యుకేషన్(శ్రీశైలం), జూలై 13 (ఆంధ్రజ్యోతి): భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దర్శనార్థం భక్తులు శ్రీశైలానికి పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో రాష్ట్రం నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో మల్లన్న క్షేత్ర పరిసరాలు కిటకిటలాడాయి. భక్తులు పుణ్యస్నానమాచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

రేపటి నుంచి ఉచిత స్పర్శ దర్శనం నిలుపుదల

నంద్యాల ఎడ్యుకేషన్(శ్రీశైలం), జూలై 13 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తుల రద్దీ దృష్ట్యా ఉచిత స్పర్శ దర్శనం రద్దు చేస్తున్నట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గత రెండు రోజుల నుంచి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగిన దృష్ట్యా మంగళవారం నుంచి 18వ తేదీ వరకు మధ్యాహ్న వేళలో కల్పించే ఉచిత స్పర్శ దర్శనం నిలిపివేస్తున్నట్లు తెలిపారు. సర్వ దర్శనం క్యూలైన్‌లలోని భక్తులందరికీ స్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పించనున్నట్లు తెలిపారు. భక్తులు మార్పును గమనించి సహకరించాలని కోరారు.

హిందూ సమాజానికి నిజాలు వెల్లడించాలి

- తిరుమల కొండపై శ్మశానం ఉందన్న విషయం కలకలం రేపుతోంది
- వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి శశిధర్



మాట్లాడుతున్న రావినూతల శశిధర్

కర్నూలు కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల కొండపై శ్మశానం ఉందన్న విషయం కలకలం రేపుతోందని, ఈ విషయంపై హిందూ సమాజానికి నిజనిజాలు వెల్లడించాలని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని రెవెన్యూ కాలనీలోగల వీహెచ్‌పీ కార్యాలయంలో వీహెచ్‌పీ దక్షిణాంధ్ర రాష్ట్ర ప్రచార, ప్రసార విభాగం మీడియా కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన శశిధర్ ఇటీవల రాష్ట్రంలో జరిగిన అనేక విషయాలను ప్రస్తావించారు. జిల్లాలో జోహరాపురానికి చెందిన నీలకంఠేశ్వర స్వామి దేవాలయం 6 ఎకరాలు అన్యాక్రాంతమైనా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వీహెచ్‌పీ దక్షిణాంధ్ర రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమిశెట్టి వెంకట్రామయ్య, కార్యదర్శి కోటేశ్వరరావు, మీడియా కన్వీనర్ భానుప్రకాశ్, జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన ఆయిల్ ట్యాంకర్



కాలువలో పడిన ఆయిల్ ట్యాంకర్

మహానంది, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులపల్లె సమీపంలోని తెలుగుగంగ కాలువలోకి ఆయిల్ ట్యాంకర్ దూసుకెళ్లింది. ఆదివారం తెల్లవారుజామున కర్నూలు నుంచి గిద్దలూరు వైపు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ అదుపుతప్పి తెలుగుగంగ కాలువలోకి దూసుకెళ్లింది. అందులో ఉన్న డ్రైవర్, క్లీనర్ చిన్నపాటి గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. లారీ నుంచి ట్యాంకర్ విడిపోయింది.

జేవీవీ స్టేట్ కమిటీలో జిల్లా వాసులకు చోటు

కర్నూలు హాస్పిటల్, జూలై 13 (ఆంధ్ర జ్యోతి): జన విజ్ఞాన వేదిక(జేవీవీ) 15వ రాష్ట్ర మహాసభ కడప నగరంలో ఆదివారం ముగిశాయి. రెండు రోజులు జరిగిన రాష్ట్ర మహాసభలో జిల్లాకు చెందిన ఐదుగురిని జేవీవీ రాష్ట్ర కమిటీలో ఎంపిక చేశారు. కర్నూలుకు చెందిన బర్మా సురేష్‌కుమార్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండగా.. ఈసారి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటుగా, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా శేషాద్రిరెడ్డిని ఎంపిక చేశారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా ఎస్.మహ్మద్ మియా, రాష్ట్ర శిక్షణ విభాగానికి రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రతాప్ రెడ్డి, వ్యవసాయ రంగంలో రాష్ట్రానికి రామకృష్ణా రెడ్డిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా బి.సురేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీలో జిల్లాకు చెందిన వారిని కీలక పోస్టులు దక్కడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ఆరేకల్లు ఎంపీటీసీ సభ్యురాలి రాజీనామా

ఆదోని రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఆరేకల్లు ఎంపీటీసీ సభ్యురాలు శ్యామలమ్మ రాజీనామా చేశారు. ప్రజాప్రతినిధిగా ఉంటూ అంగన్‌వాడీ సహాయకురాలిగా శ్యామలమ్మ ఉద్యోగం చేస్తుంది. 'ఆంధ్రజ్యోతి' ఈనెల 11న 'ప్రజాప్రతినిధికి అంగన్‌వాడీ పోస్టు' అనే కథనాన్ని ప్రచురించింది. సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జిల్లా ఉన్నతస్థాయి అధికారులు స్పందించి ఆమెను తొలగించాలని ఐసీడీఎస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం నుంచే విధులకు రావడానికి వీల్లేదని సీడీపీవో ఉమామహేశ్వరి నోటీసు ఇవ్వడానికి వెళ్లారు. ఆమె అందుబాటులో లేకపోవడంతో అంగన్‌వాడీ-2 కేంద్రానికి అతికించారు. కాగా శ్యామలమ్మ ఎంపీటీసీ పదవికి రాజీనామా చేసి ఆ పత్రాన్ని జడ్పీ సీఈవో నాసర్‌రెడ్డికి అందించారు.

ప్రజలను మోసం చేసిన సీఎం చంద్రబాబు

- వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



పోస్టర్ విడుదల చేస్తున్న వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నాయకులు

కల్లూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను సీఎం చంద్రబాబు మోసం చేశారని వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం పందిపాడు టీజీఆర్ ఫంక్షన్‌హాల్‌లో మండల అధ్యక్షుడు వై.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన చేపట్టిన కల్లూరు అర్బన్ 16వార్డులు, రూరల్, మండల నాయకుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కాటసాని శివనర సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఎస్.రేణుక పాల్గొన్నారు. ఈసందర్భంగా రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. వైసీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని పార్టీ శ్రేణులకు కాటసాని భరోసా ఇచ్చారు. అక్రమ అరెస్టులతో భయానక వాతావరణం సృష్టిస్తున్నారని బెదిరింపులకు భయపడే ప్రసక్తేలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మోసాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ అనే క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను కాటసాని రాంభూపాల్‌రెడ్డి విడుదల చేశారు.

కడుపునొప్పి తాళలేక విద్యార్థిని ఆత్మహత్య

నంద్యాల టౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక ఓ విద్యార్థిని ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఈఘటన నంద్యాల పట్టణంలోని నౌమన్‌నగర్‌లో ఆదివారం చోటుచేసుకున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. వివరాలు.. నౌమన్‌నగర్‌కు చెందిన వేదవతి, రమేశ్‌కు దంపతుల కుమార్తె సౌదామిని(17). నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతుంది. కడుపునొప్పి తాళలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మహిళ అదృశ్యం

ఆలూరు, జూలై13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలగవల్లి గ్రామానికి చెందిన మహిళ అదృశ్యం కావడం చర్చనీయాంశంగా మారింది. వివరాల మేరకు.. పొదుపు సంఘంలో రెండో లీడర్‌గా ఉన్న మహిళ బ్యాంకులో డబ్బులు చెల్లించాలని వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆమె సోదరులు అన్నిచోట్ల విచారించినా, ఆచూకీ లభించలేదు. దీంతో ఈనెల 9వ తేదీన ఆలూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా మహిళ అదృశ్యంపై అదే గ్రామంలో పని చేస్తున్న ఓ ప్రభుత్వ ఉద్యోగిపై బంధువులు అనుమానం వ్యక్తం చేస్తుండటంతో ఆదివారం ఆ ఉద్యోగిని పోలీసులు విచారించినట్లు తెలిసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి మహిళ ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు ఆలూరు ఎస్ఐ మహబూబ్‌బాషా తెలిపారు.

చిన్నబోయిన సున్నం బట్టీలు

- ఒకప్పుడు సున్నపు ఎగుమతులకు ప్రసిద్ధి
- కాలక్రమేణా మూతపడిన సున్నపు బట్టీలు
- ఉపాధి కోల్పోయిన వేలాది కార్మికులు



డోన్ పట్టణ సమీపంలో శిథిలావస్థకు చేరుకున్న సున్నపు బట్టీలు

డోన్ రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): డోన్ ప్రాంతం ఒకప్పుడు సున్నం ఎగుమతులకు ప్రసిద్ధి. కాలక్రమేణా సున్నపు ఉత్పత్తుల ఎగుమతులు తగ్గిపోయాయి. సున్నపు బట్టీలు మూతపడ్డాయి. ప్రస్తుతం ఒకటి, రెండు సున్నపు బట్టీలు నడుస్తున్నాయి. డోన్ పట్టణ సమీపంలోని కోట్లవారిపల్లెలో 30 సంవత్సరాల క్రితం సున్నపు బట్టీలు చాలా ఉండేవి. డోన్ ప్యాపిలి మండలాల్లోని ధర్మవరం, కనపకుంట, చింతలపేట, కొచ్చెర్వు, రంగాపురం, వెంకటనాయునిపల్లె, లక్ష్మంపల్లె తదితర గ్రామాల నుంచి లారీల ద్వారా ఉదయం నుంచే సున్నపుబట్టీల దగ్గరికి కార్మికులు చేరుకుని పనులు చేసేవారు. డోన్, ప్యాపిలి మండలాల్లోని పెద్దకొండ, గొల్లపల్ల బుగ్గ, చంద్రపల్లి తదితర ప్రాంతాల్లోని సున్నపు గనుల నుంచి సున్నపు ఖనిజాన్ని లారీలలో డోన్ ప్రాంతంలో ఉన్న బట్టీలకు రవాణా చేసేవారు. సున్నపు ముడి ఖనిజాన్ని బట్టీలలో కాల్చి కర్ణాటక రాష్ట్రంలోని భద్రావతి, కార్‌వాడ్, రాజమండ్రి, బెంగుళూరు, చెన్నై ప్రాంతాలకు ఎగుమతులు చేసేవారని అప్పటి కార్మికులు పేర్కొంటున్నారు. అప్పట్లో దాదాపు 3వేల మంది కార్మికులు, 40 మంది మేస్త్రీలతో కళకళలాడిన సున్నపు బట్టీలు నేడు వెలవెలబోతున్నాయి. 15 సంవత్సరాల నుంచి బట్టీలు మూతపడుతూ, కార్మికులు ఉపాధి కోల్పోతూ వచ్చారు. నాణ్యమైన ఉత్పత్తుల్లో పోటీ పడలేక ఎగుమతులు తగ్గి బట్టీలు మూతపడుతూ వచ్చాయని సీనియర్ కార్మికుడు రామాంజనేయులు తెలిపారు. నాడు వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించిన సున్నపు బట్టీలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కార్మికులు వ్యవసాయ కూలీలుగా మారారు. కొందరు ఇతర ప్రాంతాలకు వలస పోయారు.



పిచ్చిమొక్కల మధ్య సున్నపు బట్టీ

నడుచుకుంటూ వెళ్లేవాళ్లం



మాది కొచ్చెర్వు గ్రామం. 35 సంవత్సరాల క్రితం సున్నం బట్టీలో పని చేసేందుకు నడుచుకుంటూ వెళ్లేవాళ్లం. ఒక్కోసారి లారీల ద్వారా కూలీలను తరలించేవారు.

● రామాంజనేయులు, సీనియర్ కార్మికుడు, డోన్

వంద మంది పని చేసేవారు



సున్నపు బట్టీలు నడిచే రోజుల్లో నా కింద వంద మంది కార్మికులు ఉండేవారు. పట్టణంలోని కొండపేట, చిగురుపేట ప్రాంతాల నుంచి కూలీకి సున్నపు బట్టీలకు వచ్చేవాళ్లు. ఇప్పుడు బట్టీలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

● కొండన్న, సీనియర్ మేస్త్రీ

గల్లంతైన యువకుల మృతి

- తుంగభద్ర నదిలో లభ్యమైన ముగ్గురి మృతదేహాలు
- కర్ణాటక నుంచి రాఘవేంద్రుడి దర్శనానికి వచ్చి అనంతలోకాలకు..
- శోకసంద్రంగా మారిన తుంగా తీరం
- స్వగ్రామాలకు మృతదేహాల తరలింపు



మృతదేహాల వద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మంత్రాలయం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం తుంగభద్ర నదిలో గల్లంతైన యువకుల మృతదేహాలు లభ్యమయ్యాయి. వివరాలివీ.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన డిగ్రీ సెకండియర్ చదువుతున్న ఆరుగురు విద్యార్థులతో పాటు ఓ యువకుడు శనివారం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం మంత్రాలయానికి వచ్చారు. పుణ్యస్నానానికి తుంగభద్ర నదిలోకి దిగారు. వీరిలో ముగ్గురు యువకులు కొడగు జిల్లా గోనిమరూరు గ్రామానికి చెందిన అజిత్ కుమార్(19) హాసన్ జిల్లా కోలగుండ గ్రామానికి సచిన్ జీకే(20), ప్రమోద్ జీఎం(19) గల్లంతయ్యారు. గల్లంతైన ఈ యువకుల కోసం శనివారం గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం కూడా ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం, పోలీసులు, గజ ఈతగాళ్లు, చేపల వేటగాళ్లు పుట్టీలు, స్టీమర్ ద్వారా గాలింపు చర్యలు చేపట్టారు. ఉదయం 11:30 గంటల సమయంలో యువకుల మృతదేహాలు లభ్యమయ్యాయి. అజిత్ కుమార్, సచిన్ జీకే డిగ్రీ చదువుతుండగా.. ప్రమోద్ జీఎం ఓ బేకరిలో పని చేస్తున్నాడు.

ముమ్మరంగా గాలింపు

మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ, ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు ఆదేశాల మేరకు ఎస్‌డీఆర్‌ఎఫ్ ఎస్ఐ మహేంద్ర నాయక్, మంత్రాలయం ఎస్ఐ శివాంజల్, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో పుట్టీలు, స్టీమర్‌తో ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటల నుంచే గాలింపు చర్యలు చేపట్టారు. నదిలో కిలోన్నర మీటర మేర గాలించినా ఫలితం లేకపోయింది. ఆదివారం 11.30 గంటల సమయంలో గల్లంతైన స్థలం కొద్ది దూరంలో ఇద్దరు మృతదేహాలు లభ్యం కాగా, మరొకరి మృతదేహం 150 మీటర్ల దూరంలో లభ్యమైంది. ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, గజ ఈతగాళ్లు, చేపల వేటగాళ్లు, గంగపుత్రులు సంఘం నాయకులు ముగ్గురు మృతదేహాలను ఒడ్డుకు తీసుకొచ్చారు. డీఎస్పీ ఉపేంద్రబాబు, తహసీల్దార్ రమాదేవి, కోసిగి సీఐ మంజునాథ్, గంగాధర్, మాధవరం ఎస్ఐ విజయకుమార్, మంత్రాలయం ఎస్ఐ శివాంజల్, ఎమ్మిగనూరు ట్రాఫిక్ ఎస్ఐ ఎర్రన్న, ఆర్ఐ జనార్దన్‌రావు, వీఆర్వో భీమన్న గౌడు మృతి చెందిన వారి మృతదేహాలను బంధువులకు చూపించి వారి వివరాలు సేకరించారు. శ్రీమఠం అంబులెన్సులో పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను తీసుకెళ్లేందుకు ఆ యువకుల తల్లిదండ్రుల వద్ద డబ్బులు లేకపోవడంతో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ, మంత్రాలయం ఎస్ఐ శివాంజల్, తహసీల్దార్ రమాదేవి, డిప్యూటీ తహసీల్దార్ జీకే గురురాజరావు శ్రీమఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, సురేష్ కోనాపూర్‌ను కోరారు. దీంతో వారు శ్రీమఠం అధికారులతో మాట్లాడి సచిన్, ప్రమోద్ మృతదేహాలను శ్రీమఠం అంబులెన్సు ద్వారా స్వగ్రామానికి తీసుకెళ్లారు. అజిత్‌కుమార్ కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇక్కడికి రాలేదు. దీంతో అక్కడి ప్రజాప్రతినిధులు స్పందించి ఆ యువకుడి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు.

శోకసంద్రంలో యువకుల కుటుంబాలు

రెక్కాడితే డొక్కాడని కూలీల కుటుంబాలకు చెందిన ముగ్గురు యువకులు రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చి తుంగభద్ర నదిలో గల్లంతై ప్రాణాలు కోల్పోయారన్న విషయం తెలుసుకున్న వారి తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. సచిన్ తండ్రి కుమార్, ప్రమోద్ తండ్రి మోహన్, అజిత్ తండ్రి రమేష్ కూలీ పనులకు వెళ్తూ కుటుంబానికి పోషించుకుంటున్నారు. పనికి వెళ్తే గానీ రోజు గడవని పరిస్థితి వారిది. తమ పిల్లలను చదివించి మంచి ప్రయోజకులను చేయాలని డిగ్రీ చదివిస్తున్నారు. గల్లంతయ్యారనీ స్నేహితుల ద్వారా తెలుసుకున్న సచిన్ తండ్రి కుమార్, తల్లి అమ్మయ్య, ప్రమోద్ తండ్రి మోహన్, తల్లి మమత ఉండగా.. తండ్రులు, కుటుంబ సభ్యులు మాత్రమే మంత్రాలయానికి వచ్చారు. అజిత్ తండ్రి రమేష్ రావడానికి డబ్బులు లేకపోవడంతో ఇక్కడికి రాలేదు. ఈ ముగ్గురు దీన స్థితిని చూసి, యువకుల మృతదేహాల వద్ద కుటుంబ సభ్యులు, స్నేహితుల రోదనలు చూసి భక్తులు, అధికారులు కంటతడి పెట్టారు. దీంతో తుంగా తీరం అంతా శోకసంద్రంగా మారింది.



గాలింపు చర్యలు చేపట్టాలని సూచనలు చేస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



పుట్టీల ద్వారా గాలిస్తున్న దృశ్యం



మృతదేహాన్ని తీసుకువస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం

తెలుగు భాషను పరిరక్షించుకుందాం

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
- ఘనంగా ముగిసిన తెలుగు భాషా పరిరక్షణ సదస్సు



మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ చేతుల మీదుగా సత్కారం పొందిన వివిధ జిల్లాల భాషా ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషను పరిరక్షించుకుందామని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ పిలుపునిచ్చారు. మాతృభాష తెలుగును అధికార భాషగా, బోధనా భాషగా, ప్రథమ భాషగా గుర్తించాలని కోరుతూ గత రెండు రోజులుగా కొనసాగిన రాష్ట్రస్థాయి తెలుగు భాషా పరిరక్షణ సదస్సు ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టీజీ తొలుత చెన్నపురి (చెన్నై) తెలుగు అకాడమీ అధ్యక్షుడు తూమాటి సంజీవరావు రచించిన 'విశిష్ట తెలుగు-దిగ్దర్శనం' పుస్తకాన్ని సదస్సు ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు భాషకు పూర్వవైభవం తీసుకువచ్చేలా నిర్వహించే సదస్సులకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. వచ్చే ఏడాది ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటూ, తెలుగు మాట్లాడే ప్రాంతాల నుంచి భాషాభిమానులను సమీకరించి పెద్ద ఎత్తున తెలుగు భాషా పరిరక్షణ సదస్సు నిర్వహిద్దామని ఆయన పిలుపునిచ్చారు. సదస్సు నిర్వాహకులకు ఆయన రూ.50 వేలు విరాళం అందజేశారు. మరో అతిథి విశ్రాంత ఐఏఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు మాట్లాడుతూ ఈ సదస్సు ద్వారా వక్తలు వ్యక్తం చేసిన అభిప్రాయాలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. సంజీవరావు మాట్లాడుతూ ప్రముఖ రచయిత తూమాటి దోణప్ప శతజయంతి సందర్భంగా తన పుస్తకాన్ని ఆయనకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. సభాధ్యక్షత వహించిన కేసీ కల్కూర మాట్లాడుతూ రెండు రోజుల సదస్సులో ఆలోచనాత్మకమైన, శాస్త్రీయమైన, సుప్రమాణికమైన తీర్మానాలు చేశామని చెప్పారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ రెండు రోజుల భాషా సదస్సుకు కర్నూలు వేదికగా నిలవడం స్ఫూర్తిదాయకమని అన్నారు. పలు అంశాలపై తీర్మానించారు. ఈ సదస్సులో 26 జిల్లాల నుంచి విచ్చేసిన సదస్సు ప్రతినిధులను టీజీ శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. పార్వతీదేవి, శ్యామసుందర శాస్త్రి, లక్ష్మయ్య, బాలస్వామి, హైమావతి, సునీత, నీలిమ, సుబ్బలక్ష్మి, అన్నం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

భవనాలను ఉర్దూ వర్సిటీకి అప్పగించకూడదు

- సమ్మేళనంలో డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు




గురువులతో పూర్వ విద్యార్థులు

కర్నూలు, అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలను ఉర్దూ వర్సిటీకి అప్పగింకూడదని పూర్వ విద్యార్థులు డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలోని ప్రభుత్వ డిగ్రీ బాలుర కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. అంతక ముందు 1997-2000 బ్యాచ్ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ 13 ఎకరాల్లో 1991లో ఏర్పాటైన కళాశాలను ఇతర విద్యాసంస్థలకు ఇచ్చేందుకు జరిగే ప్రయత్నాలను వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులను సత్కరించారు.

తీరనున్న సాగు కష్టాలు

5వ పేజీ తరువాయి



కేసీ కెనాల్‌లో ప్రవహిస్తున్న తుంగభద్ర జలాలు


గుండ్లకేరీ నుంచి 1500 క్యూసెక్కులు వదులుతున్నారు. జిల్లా సరిహద్దుకు కాలువ నీరు చేరుతుండటంతో రైతులు ఆనందంతో మురిసిపోతున్నారు. 18వ తేదీ నుంచి పంట కాలువలకు నీరు విడుదల చేసేందుకు ఇంజనీర్లు సన్నాహాలు చేస్తున్నారు.

కేసీ కెనాల్‌కు సాగునీరు విడుదల

సుంకేసుల బ్యారేజీ నుంచి కేసీ కాలువకు ఆదివారం నీటిని విడుదల చేశారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు, నందికొట్కూరు ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, గిత్తా జయసూర్య, కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, కేసీసీ సబ్ డివిజన్ డీఈఈ ప్రసాద్‌రావులు ప్రత్యేక పూజలు చేసి కాలువ గేట్లు ఎత్తి 500 క్యూసెక్కులు వదిలారు. క్రమక్రమంగా పెంచి 2,500 క్యూసెక్కులు విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం నంద్యాలలో జరిగిన ఐఏబీ సమావేశంలో కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల్లో పూర్తి ఆయకట్టు 2.65 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని తీర్మానించారు. అందులో భాగంగానే పూర్తి స్థాయికి నీటిని విడుదల చేస్తామని డీఈఈ ప్రసాద్‌రావు తెలిపారు. అయితే తుంగభద్ర గేట్లు మరమ్మతుల దృష్ట్యా ఖరీఫ్‌కు మాత్రమే నీళ్లు ఇస్తామని ఐఏబీలో తీర్మాణించడంతో రబీ సాగు ప్రశ్నార్థకమైంది.

15న హంద్రీనీవాకు కృష్ణాజలాలు

శ్రీశైలం జలాశయం గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు, పూర్తి స్థాయి సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా.. ఆదివారం 883.30 అడుగుల లెవెల్‌లో 206.09 టీఎంసీల నీటిని నిల్వ చేశారు. ఎగువ నుంచి 1,28,426 క్యూసెక్కులు వరద వచ్చి చేరుతోంది. జూరాల, సుంకేసుల నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. దీంతో స్పిల్‌వే ద్వారా 27,295 క్యూసెక్కులు, పవర్ హౌస్ ద్వారా 68,330 క్యూసెక్కులు దిగువ సాగర్‌కు వదులుతున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 20వేల క్యూసెక్కులు సీమ కాలువలకు మళ్లిస్తున్నారు. శ్రీశైలానికి భారీగా వరద వచ్చి చేరుతుండటంతో ఈ నెల 15 నుంచి నందికొట్కూరు మండలం మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి హంద్రీనీవా కాలువకు కృష్ణాజలాలు ఎత్తిపోసేందుకు ఎస్ఈ పాండురంగయ్య ఆధ్వర్యంలో ఇంజనీర్లు సన్నాహాలు చేస్తున్నారు. కెనాల్ విస్తరణ పనులు చేయడంతో ఈ ఏడాది పూర్తి స్థాయిలో 3,850 క్యూసెక్కులు నీటిని ఎత్తిపోసేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. అయితే పత్తికొండ కుడి, ఎడమ కాలువలు అసంపూర్తిగా వదిలేయడంతో 65వేల ఎకరాలకు సాగునీరు అందని దైన్య పరిస్థితిగా మారింది.



తుంగభద్ర డ్యాం నుంచి నదికి నీటిని విడుదల చేస్తున్న వరద

నిఘా నేత్రం.. కట్టుదిట్టం

• నేరాల నియంత్రణకు పోలీసుశాఖ కసరత్తు • ఆత్మకూరు పట్టణంలో 63 సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు


ఆత్మకూరు పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్

ఆత్మకూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇటీవల జరిగిన పలు దొంగతనాలు పోలీసులకు సవాలుగా మారాయి. సీసీ కెమెరాల పర్యవేక్షణ లేకపోవడం వల్ల నిందితులను పట్టుకోవడం పోలీసులకు కష్టతరంగా మారింది. దాంతో నేరాల నియంత్రణకు పోలీసుశాఖ కసరత్తు మొదలుపెట్టింది. అసాంఘిక, అవాంఛనీయ చర్యల నియంత్రణలో భాగంగా సీసీ కెమెరాలతో నిఘా ఉంచేలా ప్రత్యేక దృష్టి సారించింది. పట్టణంలోని అన్ని ప్రధాన రహదారులు, కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లయితే నేరాలను నియంత్రించే అవకాశం ఉండటంతో పోలీసుల ఆదిశగా చర్యలు చేపట్టారు. ఇందుకోసం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి చొరవతో సుమారు రూ.8లక్షల వ్యయంతో 63 సీసీ కెమెరాలతోను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో కొన్ని స్కానింగ్ కెమెరాలు కూడా ఉన్నాయి. ప్రత్యేకించి నంద్యాల, కర్నూలు, శ్రీశైలం వంటి ప్రధాన రస్తాలతో పాటు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, గౌడ్‌సెంటర్, నంద్యాల టర్నింగ్, సంగమేశ్వరం సర్కిల్, పాతబస్టాండ్ తదితర ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. వీటన్నింటిని ఆత్మకూరు పోలీసుస్టేషన్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి ఎప్పటికప్పుడు పోలీసులు నిఘాను కట్టుదిట్టం చేయనున్నారు. వారం రోజుల్లో ఈ పనులన్ని పూర్తిచేసి ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

సీసీ కెమెరాలతో కట్టుదిట్టమైన నిఘా

ఆత్మకూరులో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలతో నిఘా ఉంచేలా చర్యలు చేపట్టాం. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సహకారంతో 63 సీసీ కెమెరాలను ఏర్పాటుచేయనున్నాం. వీటిని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానంచేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాం. వ్యాపారులు, గృహాల యజమానులు, ఇతరసంస్థల తమ వారు సీసీ కెమెరాలను ఏర్పాటుచేసుకుంటే నేరాలను పూర్తిస్థాయిలో నియంత్రించొచ్చు.

• డీ.రాము, అర్బన్ సీఐ, ఆత్మకూరు

నేడు ప్రమాణ స్వీకారం

పగిడ్యాల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పగిడ్యాల వ్యవసాయ పరపతి సహకార సొసైటీ నూతన ఛైర్మన్‌గా దామోదర్‌రెడ్డి సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. డైరెక్టర్‌గా నెహ్రూనగర్‌కు చెందిన గంగన్న, ప్రాతకోటకు చెందిన శంకర్ నియమితులయ్యారు. కార్యక్రమానికి నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి హాజరుకానున్నారు. గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని దామోదర్‌రెడ్డి కోరారు.

టీడీపీతోనే సంక్షేమం

పాములపాడు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పేదల అభివృద్ధే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఒక్క కూటమి ప్రభుత్వానికే దక్కిందని టీడీపీ నాయకులు ఉస్మాన్ బాషా, మద్దిలేటి, రాజు, జలాల్‌బాషా, మల్లికార్జున అన్నారు. ఆదివారం పాముల పాడులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే వేంపెంట గ్రామంలో మాజీ సర్పంచ్ రామసుబ్బమ్మ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.

ధర్మకర్తల మండలికి దరఖాస్తు చేసుకోవాలి

పాములపాడు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపెంట కేశవ, రామచంద్ర, ఆంజనేయస్వామి దేవాలయాలకు ధర్మకర్త మండలికి ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని ఆదివారం దేవాదాయశాఖ ఏడీ వెంకటరమణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ విజయవాడ దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఈ నెల 30లోగా నంద్యాలలోని రైతునగరం దేవదాయశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. ఇందుకు గాను తొమ్మిదిమంది సభ్యులు ఉండాలని, ఇందులో ఛైర్మన్ పదవికి ఓసీ పురుషుడు, సభ్యులుగా మహిళలు, పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

నంద్యాల హాస్పిటల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ (జేశాప్)రాష్ట్ర సమితి పిలుపు మేరకు నంద్యాల నియోజకవర్గ నూతన కమిటీని ఆదివారం రామకృష్ణ పీజీ కాలేజి ఆడిటోరియంలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, జేశాప్ రాష్ట్ర నాయకుడు మోహన్, కార్యవర్గ సభ్యుడు అబ్రహాం, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శ్యామ్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఎన్ఎండీ ఫిరోజ్ మాట్లాడుతూ నిత్యం వార్తల సేకరణలో బిజీగా ఉన్న జర్నలిస్టులకు క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అనంతరం నంద్యాల నియోజకవర్గ జేశాప్ అధ్యక్షుడిగా చల్లా మధును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా శివశంకరరెడ్డి, సహాయ కార్యదర్శులుగా సాయివర్మ, ప్రదీప్, జాయింట్ సెక్రటరిగా మహబూబ్‌బాషా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాజశేఖర్, కోశాధికారిగా చార్లెస్, ఉపాధ్యక్షులుగా అర్షద్‌అలీఖాన్, బాలు నాయక్, గిరిసాగర్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులను రాష్ట్ర, జిల్లా కార్యవర్గం అభినందించి సన్మానించారు.

విద్యుత్ భారాన్ని ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సర్దుబాబు పేరిట ప్రజలపై వేసిన రూ.842కోట్ల విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు రణధీర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 ఏప్రిల్ నుంచి యూనిట్‌కు 40పైసల చొప్పున వినియోగదారుల నుంచి ఇంధన సర్దుబాటు చార్జీలను వసూళ్లు చేయడం సరికాదన్నారు. ఎన్నికల ముందు ప్రజలపై విద్యుత్ భారాలను మోపమని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నేడు ప్రజలపై లేనిపోని భారాలు మోపడం అన్యాయమని అన్నారు. విద్యుత్ చార్జీలను ఆగస్టు 1 నుంచి నిలిపివేయాలని, లేనిపక్షంలో భారీ ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు రామ్‌నాయక్, సురేంద్ర, వీరన్న, నాగేశ్వరరావు, షేక్ ఇస్మాయిల్, పీ.భాస్కర్ తదితరులున్నారు.

మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు


బొల్లు రాముతో సీఐ

ఆత్మకూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పోలీసుస్టేషన్ పరిధిలో నమోదైన ఓ మిస్సింగ్ కేసును ఎట్టకేలకు ఏడాది తర్వాత పోలీసులు ఛేదించారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని వడ్లపేటకు చెందిన బొల్లు రాము అనే వ్యక్తి అప్పుల భారంతో 2024 మేలో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎంతకీ ఆచూకీ లభించకపోవ డంతో ఆత్మకూరు పోలీసుస్టేషన్‌లో అతడి భార్య ప్రసన్నలక్ష్మీ ఫిర్యాదు చేసింది. పెండింగ్ కేసులపై ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా ప్రత్యేక దృష్టి సారించడంతో అర్బన్ సీఐ రాము కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. బొల్లు రాము హైదరాబాదులో ఉన్నట్లు గుర్తించి ప్రత్యేక బృందాన్ని అక్కడికి పంపించేశారు. పంజాగుట్ట, సనత్‌నగర్ ఏరియాల్లో అతను ఉన్నట్లు సీసీ కెమెరాల్లో గుర్తించారు. ఆ పరిసరాల్లో విచారించగా అతను ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తున్నట్లు తెలుసుకున్నారు. అయితే అక్కడ కూడా లేకపోవడంతో ఫోన్ నంబర్ ఆధారంగా లోకేషన్ ట్రేస్ చేసి అతన్ని ఆత్మకూరు పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి వారి కుటుంబసభ్యులకు అప్పగించారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

• టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్


హోటల్ వద్ద టిఫిన్ చేస్తున్న ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని 11వ వార్డులో టీడీపీ ఇన్‌చార్జి కట్టెల అఫ్జల్ ఆధ్వర్యంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యా, వైద్య పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పట్టణంలోని సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. అర్హులందరిని గుర్తించి ప్రతి ఒక్కరికి పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణంలో ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మహానంది, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని కేసీ కెనాల్ ప్రాజెక్టు డైరెక్టర్ బన్నూరు రామలింగారెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మహానంది గ్రామంలో పార్వతినగర్, ఈశ్వర్‌నగర్ కాలనీల్లో రామలింగారెడ్డి పర్యటించి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. అటవీశాఖ అధికారులు తమ షాపులను ఖాళీ చేయిస్తున్నారని స్థానికులు వారి దృష్టికి తీసుకెళ్లారు. అధికారులతో మాట్లాడి ఏ ఒక్కరికీ అన్యాయం జరుగకుండా చేస్తామని వారికి హామీనిచ్చారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. గంగిశెట్టి మల్లికార్జున, రామచంద్రుడు, రాజా, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

• నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య


నందికుంటలో కరపత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే

కొత్తపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. ఆదివారం మండలంలోని నందికుంట గ్రామంలో మండల కన్వీనర్ నారపురెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి లింగస్వామి గౌడు అధ్యక్షతన స్థానిక టీడీపీ నాయకులు జహరుల్లా ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను దశల వారిగా అమలు చేస్తున్నారని, ఎవరూ అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. వైసీపీ నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, షమీవుల్లా, మన్సూర్‌వలి, జీఎండీ రఫీ, నాగేశ్వరరావు యాదవ్, అమర్ నాథ్ యాదవ్, జానకీ రాముడు, పోతనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసమే శక్తి టీమ్


శక్తి టీమ్ యాప్ గురించి వివరిస్తున్న పోలీసులు

మిడుతూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): చిన్నారులు, మహిళల రక్షణకోసం రాష్ట్ర ప్రభుత్వం శక్తిటీమ్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ ఓబులేసు తెలిపారు. ఆదివారం మిడుతూరులోని మాడల్ స్కూల్ బాలికల వసతి గృహంలో శక్తిటీమ్ ఏఎస్ఐ సీతమ్మ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎక్కడైనా మహిళలు ఇతరులతో ఇబ్బందులు పడే పరిస్థితులు తలెత్తినప్పుడు శక్తిటీమ్ నెంబర్లు 100, 112, 1930, 1098, 181కు డయల్ చేసి ఫిర్యాదు చేయొచ్చని వివరించారు. సమాచారం అందించిన 15 నిమిషాల లోపు శక్తి టీమ్ ఘటన స్థలానికి చేరుకొని ఆదుకుంటుందని వివరించారు. మహిళలు అందరూ శక్తీ టీమ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు. పోలీసులు నాగన్న, మస్తాన్‌వలి, వార్డెన్ ఇమాంబి, బాలికలు పాల్గొన్నారు.

భారత సైన్యంలో అహీర్ రెజిమెంట్ ఏర్పాటు చేయాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

ఆత్మకూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): భారత సైన్యంలో అహీర్ రెజిమెంట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో చేపట్టిన రెజాంగ్ లా కలశ యాత్రను విజయవంతం చేయాలని ఆ సంఘం రాయలసీమ ఇన్‌చార్జి శేషఫణి యాదవ్ కోరారు. ఆదివారం ఆత్మకూరులోని జీ.పుల్లారెడ్డి హైస్కూల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రెజాంగ్ లా కలశ యాత్ర కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సాగుతుందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 19న ఆత్మకూరు పట్టణానికి యాత్ర రానుందని, యాదవులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కాగా 1962లో జరిగిన భారత్ - చైనా యుద్ధంలో 114మంది యాదవ సైనికులు అమరులయ్యారని వారికి జ్ఞాపకంగా ఏర్పాటు చేసిన రెజిమెంట్‌ను కేంద్రం తొలగించిందని, మళ్లీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తిరుపమయ్య, వెంకటశేషయ్య, వెంకటరమణ తదితరులున్నారు.

గని హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

గడివేముల, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గని హైస్కూల్ విద్యార్థులు ప్రేమ్‌కుమార్, రంజిత్‌కుమార్‌లు శ్రేష్ట పరీక్ష ఫలితాల్లో ఆల్‌ఇండియా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కేంద్ర సామాజిక న్యాయం-సాధికార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నేషనల్ ఎంట్రెన్స్ టెస్ట్‌ఫర్ శ్రేష్ట ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో ప్రేమ్‌కుమార్ 435 ర్యాంకు, రంజిత్‌కుమార్ 679 ర్యాంకు సాధించారు. ఉత్తమ ప్రతిభకనబరిచిన విద్యార్థులకు హైస్కూల్ ప్రధానోపా ధ్యాయులు విజయ, పాఠశాల కమిటీ ఛైర్మన్ వెంకట్‌నాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.


ప్రేమ్‌కుమార్, రంజిత్‌కుమార్

ప్రభుత్వ పథకాలపై అవగాహన

పగిడ్యాల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాతకోట గ్రామంలో టీడీపీ నాయకుడు నాగేషులు, నెహ్రూనగర్ గ్రామంలో చాకలి రామస్వామి ఆధ్వర్యంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, చంద్రమోహన్, వెంకట్‌రెడ్డి , బాలీశ్వరుగౌడ్, శేషు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు దివ్యాంగులకు పరికరాలు

పాణ్యం, జూలై 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మంగళ వారం దివ్యాంగులకు, వృద్ధులకు పరికరాలు పంపిణీ చేస్తున్నట్లు టీడీపీ నాయకుడు పుల్లారెడ్డి తెలిపారు. ఆదివారం పాణ్యంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ఆధ్వర్యంలో వృద్ధులకు, దివ్యాంగులకు పరికరాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఏడీఐపీ పథకం ద్వారా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో అర్హులైనవారు తమ ఆధార్, రేషన్, సదరం సర్టిఫికెట్లను తమ వెంట తీసుకురావాలని కోరారు. అర్హులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు, చేతితో నడిపే ట్రై సైకిళ్లు, వీల్ ఛైర్స్, వినికిడి పరికరాలు, వాకింగ్ స్టిక్స్, కృత్రిమ అవయవాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు


కురుకుంద గ్రామంలో అవగాహన కల్పిస్తున్న సీఐ

ఆత్మకూరు రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు సీఐ రాము హెచ్చరించారు. ఆదివారం మండలంలోని కురుకుంద గ్రామంలో పోలీస్ సిబ్బందితో కలిసి కార్డన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రౌడీషీటర్లు, అనుమానితులు, నేరచరిత్ర గల వారి ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అనుమానితుల వేలిముద్రలను మొబైల్ సిస్టం చెక్ డివైజ్ ద్వారా పరిశీలించారు. ఈ కార్డన్‌సర్చ్‌లో భాగంగా సరైన ధ్రువపత్రాలు లేని పది మోటార్ సైకిళ్లను, 14 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామంలో సైబర్ నేరాలు, పోక్సో చట్టం, బాల్య వివాహాలు, మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, రోడ్డు భద్రత, సీసీ కెమెరాల ఏర్పాటు, శక్తియాప్ వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ప్రజలు డయల్ 112 ద్వారా పోలీస్ శాఖకు సమాచారం అందించాలని సీఐ రాము ప్రజలను కోరారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

• సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకుడు వెంకటేశ్వర్లు • నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా


మాట్లాడుతున్న నాయకుడు వెంకటేశ్వర్లు

నందికొట్కూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు కోరారు. ఆదివారం పట్టణంలోని పింఛన్ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలు, గృహనిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని మరిచారన్నారు. అలాగే పించన్లు, కొత్త రేషన్ కార్డులు, నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు రూ.1500 వంటి వాగ్దానాలను అమలు చేయలేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరుతూ నేడు కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహిస్తున్నట్ల తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు

• మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాలరూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వైవిధ్యమైన నటనతో తెలుగు సినీరంగంలో చెరగని ముద్ర వేసుకున్న విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు అని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతికి సంతాపాన్ని వ్యక్తం చేశారు. కోట శ్రీనివాసరావు సినీరంగాన్ని తెలుగుజాతికే తీరని లోటని అన్నారు

కనీస సౌకర్యాలు కరువు

• పరిశ్రమల కార్యాలయంలో సమస్యల తిష్ట • వేధిస్తున్న సిబ్బంది కొరత


డీఎస్ఏ భవన సముదాయంలోని పరిశ్రమల కార్యాలయం

పోస్టుల ఖాళీలు: అసిస్టెంట్ డైరెక్టర్-1, ఐపీవోలు 3, జూనియర్ అసిస్టెంట్ 1, స్టెనోగ్రాఫర్ 1, టైపిస్ట్ 1, అటెండర్ 1చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

నంద్యాల హాస్పిటల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి నంద్యాల వేరు అయినా కొన్ని జిల్లా శాఖల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కనీస వసతుల్లేక సిబ్బంది కొరతతో కొట్టుమిట్టాడుతున్నాయి. జిల్లా కేంద్రంలో జిల్లా శాఖలకు భవనల్లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇదేకోవలో సమస్యల సుడిగుండంలో జిల్లా పరిశ్రమల కార్యాలయం కొట్టుమిట్టాడుతోందని చెప్పవచ్చు. 2022లో నంద్యాల జిల్లా కేంద్రం అయిన తర్వాత పద్మావతి నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జిల్లా పరిశ్రమలశాఖకు ఒక గది కేటాయించి నిర్వహిస్తున్నారు. గది సరిపోక పోవడంతో వరండాలో పార్టిషన్ చేసుకొని సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా పరిశ్రమలశాఖకు వాహన సదుపాయం లేకపోవడంతో ఉన్నతాధి కారి జిల్లా అంతటా పర్యటించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. అసలే పరిశ్రమలు ఆపై తనిఖీలు చేసేందుకు కిలోమీటర్లు వెళ్లాల్సిన పరిస్థితి. అంతే కాకుండా సిబ్బంది కొరత కార్యాలయాన్ని వేధిస్తోంది. పరిశ్రమలు సుదూర ప్రాంతాల్లో ఉండటంవల్ల జిల్లా అధికారి పర్యవేక్షించడం కష్టతరంగా మారింది. సొంత వాహనాల్లో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లా పరిశ్రమల శాఖను పట్టించుకోలేదని తెలుస్తోంది. గత మూడేళ్లుగా జిల్లా అధికారికి వాహనం లేకపోవడమే ఇందుకు నిదర్శనమని చెప్పవచ్చు. డీఎస్ఏ అధికారులు వారి సౌకర్యార్థం నిర్మించుకున్న గదిలో పరిశ్రమల కార్యాలయం కొనసాగుతోందని, సొంత భవనానికి మోక్షం ఎప్పుడు వస్తుందోనని పలువురు చర్చించుకుంటున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

పాములపాడు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యమని సీఐ సురేశ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని జూటూరు గ్రామంలో ఎస్ఐ సురేశ్‌బాబు ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో అనుమానితులు, నేరచరిత్ర గల వారి ఇళ్లలో సోదాలు నిర్వహించారు. పిక్కిలి ఈశ్వరయ్య అనే వ్యక్తి వద్ద నుంచి 31 క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే సరైన పత్రాలు లేని తొమ్మిది మోటారు సైకిళ్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.


జూటూరులో కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్న సీఐ, ఎస్ఐ

బడా పెట్టుబడుదారులకు తాకట్టు

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య



ర్యాలీలో పాల్గొన్న నాయకులు

బేతంచెర్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలోని సంపదను అంతా బడా పెట్టుబడిదారులకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ తాకట్టు పెడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య అన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని పాతబస్టాండులో సీపీఐ నాల్గవ పట్టణ, మండల మహాసభలు కార్యదర్శి భార్గవ్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా కర్నూలు-నంద్యాల క్రాస్ రోడ్డులోని శేషారెడ్డి విగ్రహం నుంచి పాత బస్టాండు వరకు సీపీఐ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతర సభలో రామచంద్రయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అందించడంలో విఫలమైందన్నారు. పేదల పక్షాన నిలిచిన పార్టీ సీపీఐనే అన్నారు. సమావేశంలో నంద్యాల ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, కార్య వర్గ సభ్యులు రామాంజనేయులు, నాయకులు ఫక్రుద్దీన్, తిరుమ లేష్, దస్తగిరి, మహాలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీజీపీ లైనింగ్ పనులకు నిధులు మంజూరు

చాగలమర్రి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ ప్రధాన కాలువలో దెబ్బతిన్న లైనింగ్, స్ట్రక్చర్ల మరమ్మతు పనుల కోసం రూ.1.60 కోట్లు నిధులు మంజూరైనట్లు టీజీపీ డీఈ వెంకటరమణ తెలిపారు. ఎస్‌డీఎంఎఫ్ ద్వారా మంజూరైన రూ.కోటి, ఆపరేషన్ మెయింటెనెన్స్ ద్వారా రూ.60లక్షలు కేటాయించారన్నారు. ఆ నిధులతో పనులు వేగవంతం చేస్తున్నామన్నారు. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా టీజీపీ కాలువకు రెండు రోజుల్లో నీరు విడుదల చేయడం జరుగుతుందని, ఆయకట్టు రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

నేరాలకు పాల్పడితే భవిష్యత్తు అంధకారం

కొలిమిగుండ్ల, జూలై 13(ఆంధ్రజ్యోతి) : ఆవేశం, స్వార్థ పూరిత ఆలోచనలతో నేరాలకు పాల్పడితే భవిష్యత్తు అంధకారమవుతుందని కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పాత నేరస్థులకు సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. క్షణికావేశంలో తెలిసో తెలియకో తప్పులు చేసిన వారు ప్రవర్తనను మార్చుకొని శాంతియుతజీవనాన్ని కొనసాగించాలని సీఐ సూచించారు.

చాగలమర్రి: గ్రామాల్లో రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంటుందని ఎస్ఐ సురేష్ తెలిపారు. ఆదివారం చాగలమర్రి పోలీసు స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

బేతంచెర్ల: గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని బేతంచెర్ల సీఐ వెంకటేశ్వరరావు రౌడీ షీటర్లను హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

పెన్షనర్లకు డీఏ ప్రకటించాలి

కోవెలకుంట్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు తక్షణం డీఏలు (కరువుభత్యం) చెల్లించి మెరుగైన పీఆర్సీ ప్రకటించాలని ఆర్‌జేయూపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.షరీఫ్ ప్రభుత్వాన్ని ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. 2024 జనవరి నుంచి మూడు డీఏలు పెండింగులో ఉన్నాయన్నారు. పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించి ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు న్యాయం చేయాలని షరీఫ్ కోరారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థినులు

బేతంచెర్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1998-99 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు 26 ఏళ్ల తర్వాత విశ్రాంత ఉపాధ్యాయుడు ఆదినారాయణ ఆధ్వర్యంలో సమ్మేళనాన్ని నిర్వహించారు. నాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు ఆదినారాయణ, వెంకట్రావు, వెంకటరెడ్డి, కృష్ణమోహన్, ఆనంద్, శివకుమారీలను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గుద్దేటి హరి, ఫయాజ్, వెంకటేశ్, నాగయ్య, ప్రసాద్, సునీత, రాజ్యలక్ష్మి, హేమలత, నాగేశ్వరరి, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాలతో అమ్మవారి అలంకరణ



ప్యాపిలి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమ్మవారి ఆలయంలో 15 రోజులుగా ఆషాఢ పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం స్థానిక కన్యకాపరమేశ్వరీదేవి అమ్మ వారిని ఆర్యవైశ్య భక్తులు వేరుశనగ విత్తనాలతో అలంకరించారు. ఈ మాసంలో అమ్మవారిని పూజిస్తే వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా వస్తాయని భక్తులు తెలిపారు. ఈ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం

బనగానపల్లె, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శక్తిక్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాత ఆలయాభివృద్ధికి కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన భక్తులు ఆదివారం విరాళం అందించినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి తెలిపారు. ముందుగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రూ.25వేల నగదును ఆలయ కమిటీ చైర్మన్‌కు అందజేశారు. ఆలయ సిబ్బంది, పూజారులు పాల్గొన్నారు.

సినీ నటుడి మృతికి మంత్రి సంతాపం

బనగానపల్లె, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతికి రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదివారం సంతాపం ప్రకటించారు. 750కిపై సినిమాల్లో నటించి క్యారక్టర్ ఆర్టిస్టుగా పేరు తెచ్చుకున్నారన్నారు. వైవిద్యభరితమైన నటనతో ప్రతినాయకుడుగా, కమెడియన్‌గా సినిమాల్లో నటించి పేరు తెచ్చుకున్నారన్నారు. ఆయన మృతి సినీరంగానికి తీరని లోటని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు మంత్రి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

డోన్ టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణను డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ఆదివారం పరామర్శించారు. రామకృష్ణ ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

మద్యం మత్తులో.. వాకిళ్లు ధ్వంసం

● జగనన్న కాలనీలో మితిమీరిన మందుబాబుల ఆగడాలు

● పోలీసుల నిఘా కరువు

● గస్తీ పెంచాలని ప్రజా సంఘాల డిమాండ్



జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

డోన్ రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో మందుబాబుల ఆగడాలు మితిమీరుతున్నాయి. మందుబాబులకు జగనన్న కాలనీ అడ్డాగా మారింది. గత వైసీపీ ప్రభుత్వంలో డోన్ పట్టణ సమీపంలో దొరపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని దొరపల్లెగుట్టపై పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులకు రూ.1.80లక్షలు మంజూరు చేశారు. నిధులు సరిపోకపోవడంతో మధ్యలోనే వదిలేశారు. అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలు మందుబాబులకు అడ్డాగా మారాయి. మద్యంబాబు మందు తాగి చిందులు వేయడమే గాక.. మద్యం సీసాలు పగులకొట్టి, భవనాల వాకిళ్లు, కిటికిలను ధ్వంసం చేస్తున్నారని లబ్ధిదారులు, ప్రజాసంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల చిగురు మానుపేటకు చెందిన భూలక్ష్మీదేవి అనే మహిళ ఇంటి వాకిళ్లను గుర్తు తెలియని మద్యంబాబులు ధ్వంసం చేశారు. పోలీసుల నిఘా లేకపోవడంతో మందుబాబులకు జగనన్న కాలనీ అనువుగా మారిందని విమర్శలున్నాయి.

పోలీసుల గస్తీ పెంచాలి



జగనన్న కాలనీలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. పోలీసుల నిఘా లేకపోవడంతో అసాంఘిక శక్తులు పెట్రేగి పోతున్నాయి. మద్యం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా కూడా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. పోలీసులు గస్తీని పెంచాలి.

● నక్కి శ్రీకాంత్, సీపీఎం నాయకులు, డోన్

నిఘా ఉంచాం



పట్టణ శివారు కాలనీల ప్రాంతాలపై పోలీసుల నిఘా ఉంది. పట్టణ సమీపం లోని జగనన్న కాలనీ నివాసాల ప్రాంతంలో పోలీసుల నిఘా ఉంచాం. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి, పబ్లిక్‌కు నష్టం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

● ఇంతియాజ్‌బాషా, పట్టణ సీఐ, డోన్

ఏపుగా పెరిగిన కంప చెట్లు



ఇళ్ల మధ్య పెరిగిన పిచ్చిమొక్కలు

చాగలమర్రి: మండల కేంద్రంలోని గుంతపాలెం వీధి సమీపంలోని జగనన్న కాలనీ కంప చెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. గత వైసీపీ ప్రభుత్వంలో గుంతపాలెం రహదారిలో 194 మంది లబ్ధిదారులకు గృహాలు ఇచ్చారు. ఆరుగురు మాత్రమే గృహాలు పూర్తి చేశారు. 122 మంది బేస్‌మెంట్‌లు వేసి వదిలేశారు. 54 మంది లబ్ధిదారులు గృహాల పనులు చేపట్టలేదు. మరి కొందరి లబ్ధిదారుల గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. కొంత మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోకుండానే స్థలాలను అమ్ముకున్నట్లు సమాచారం. కాలనీ మొత్తం ముళ్ల పొదలతో నిండిపోయింది. వర్షం పడితే రహదారులు బురద కుంటలుగా మారుతున్నాయి. కాలనీ సమీపంలోనే శ్మశాన వాటిక ఉంది. గ్రామంలోని చెత్తాచెదారం ట్రాక్టర్లతో తీసుకెళ్లి గృహాల మధ్యలో పడేశారు. చెత్తాచెదారానికి నిప్పు పెట్టడంతో పొగ నిండుకుంటోంది. గృహాలు నిర్మించుకోకపోవడంతో కాలనీలో ముళ్ల కంపలు పెరిగాయి. గత ప్రభుత్వ పాలకులు లబ్ధిదారుల బాగోగుల గురించి పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి లేఔట్‌లు పరిశీలిస్తే లబ్ధిదారుల సమస్యలు వెలుగు చూస్తాయి.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

• పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యే కోట్ల దంపతులు

• అభివృద్ధి, సంక్షేమంపై కరపత్రాల పంపిణీ



డోన్‌లో ప్రజలకు కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్ టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. ఆదివారం పట్టణంలోని పాతపేట 5, 6, 12వ వార్డుల్లో టీడీపీ సీనియర్ నాయకులు సుధీష్, భారతి ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్య క్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందు తున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏవైనా ఉం టే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి చం ద్రబాబు నాయుడు కుల, మత రాజకీయాలకు అతీతంగా అందరికీ అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని తెలిపారు. ఏడాది పాల నలో ప్రభుత్వం ఏమి చేసిందో వివరించారు.

సంక్షేమ హాస్టళ్ల సందర్శన

పట్టణంలోని పాతపేటలోని ప్రభుత్వ బాలికల బీసీ వసతి గృహాన్ని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సందర్శించారు. హాస్టల్‌కు వెళ్లిన ఎమ్మెల్యే దంపతులకు వార్డెన్, విద్యార్థులు స్వాగతం పలికారు. విద్యార్థుల వసతి సౌకర్యాలు, భోజన నిర్వహణ, ఆరోగ్య సంరక్షణ వంటి అంశాలపై వారు అడిగి తెలుసుకున్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంలో సన్న బియ్యంతో కూడిన రుచికరమైన అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

ఆర్యవైశ్యుల సమస్యలు పరిష్కరిస్తాం

ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డోన్ ఎమ్మెల్యే కోట్ల పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీరాముల దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులతో ఎమ్మెల్యే కోట్ల సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా ఆర్యవైశ్య సంఘం సభ్యులు కొన్ని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రతి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ సర్పంచ్ పెద్దకేశవయ్య గౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, టీడీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి లబ్ధి

శిరివెళ్ల, జూలై 13(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెలుగు గంగ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ చెన్నారెడ్డిగారి సంజీవ కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం గంగవరంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: రాష్ట్రంలో టీడీపీతోనే సుపరిపాలన సాధ్యమని టీడీపీ వార్డు కన్వీనర్ అంకన్నయాదవ్, మాజీ సర్పంచ్ తులశమ్మలు తెలిపారు. ఆదివారం దొర్నిపాడు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బాలిరెడ్డి, ఉసేని, మద్దిలేటి, మనోహర్, దస్తగిరి, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: మండలంలోని పి నాగిరెడ్డిపల్లెలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామ మద్దిలేటి, టీచర్ మద్దులేటి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొండ చిలువ కలకలం

రుద్రవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో ఆదివారం రాత్రి కొండచిలువ కలకలం రేపింది. మసీదు సమీపంలో ఇళ్ల మధ్య కొండచిలువ ప్రత్యక్షం కావడంతో స్థానికులు భయాందోళన చెందారు. 7 నుంచి 8 అడుగులు పొడవు ఉందని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న రుద్రవరం బీట్ ఆఫీసరు సురేంద్రగౌడ్ కొండచిలువను పట్టుకుని అడవిలో వదిలారు. స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

డోన్‌లో పోలీసుల విస్తృత తనిఖీలు



డోన్ రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

డోన్ రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో జీఆర్‌పీ, పోలీసులతో కలిసి పట్టణ పోలీసులు విస్తృత తనిఖీలు చేశారు. పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, రూరల్ సీఐ సీఎం రాకేష్‌బాబు, పోలీసు సిబ్బంది, రైల్వే జీఆర్‌పీ, సీఆర్‌పీ పోలీసులతో కలిసి తనిఖీలు చేశారు. అలాగే పట్టణంలోని చిగురుమానుపేటలో అనుమానాస్పద ఇళ్లలో పట్టణ పోలీసు అధికారులు సోదాలు చేశారు.

కాలువ కాదు.. రహదారి



కొండమాయపల్లెలో రహదారి వెంట ప్రవహిస్తున్న చెరువు నీరు

రుద్రవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఇది కాల్వ కాదండోయ్.. సీసీ రోడ్డు. ఆదివారం చినరాజుచెరువు తూము షట్టర్ ఎత్తి నీటిని విడుదల చేయడంతో కాల్వలు సరిగా లేక నీరంతా గ్రామంలో సీసీ రోడ్ల వెంట ప్రవహించింది. నీటిలో విషసర్పాలు కూడా వచ్చాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని, ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని రహదారి వెంట నీరు ప్రవహించకుండా చూడాలని కోరారు.



అడుగంటిన పాలేరు వాగు

ఒట్టిపోయిన పాలేరు వాగు

సంజామల, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రవహించే పాలేరు వాగు ఈ ఏడాది ఒట్టిపోయింది. పైతట్టు ప్రాంతంలోని అవుకు రిజర్వాయర్‌లో నీటి మట్టం తగ్గడం, గొల్లలేరు డ్రైన్‌కు నీరు విడుదల కాకపోవడంతో పాలేరు వాగు ఒట్టిపోయింది. దాంతో పరివాహక గ్రామాలైన వసంతాపురం, హోత్రమాన్‌దిన్నె, బొందలదిన్నె, కమలపురి, ముదిగేడు, ముక్కమళ్ల, ముచ్చలపురి, ఎగ్గోని, కొత్తపేట, సంజామల గ్రామాల ప్రజలు తాగు,సాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. ముందస్తు వర్షాలు కురవడంతో ఖరీఫ్‌లో రైతులు మొక్కజొన్న, మినుము, కంది పంటలను సాగు చేశారు. వీటితోపాటు నారుమళ్లు పోసుకున్న రైతులు సాగునీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జూన్, జూలై నెలల్లో కనీస వర్షపాతం నమోదు కాలేదు. రైతులు దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

గంగమ్మకు బోనాల సమర్పణ



గంగమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

కొలిమిగుండ్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనకాద్రిపల్లె ఆదివారం మహిళలు గంగమ్మకు బోనాలు సమర్పించారు. రాఘవరాజుపల్లె గ్రామ సమీపంలో కాటమయ్య గుడి వద్ద అమ్మవారికి బోనాలు సమర్పించి, వానలు కురవాలంటూ పాటలు పాడుతూ, ప్రార్థనలు చేశారు. కనకాద్రిపల్లె, రాఘవరాజుపల్లె మహిళలు పాల్గొన్నారు.

శాకంబరిగా వాసవీమాత



వాసవీమాతకు పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాత శాకంబరి అలంకారంలో కొలువుదీరారు. అమ్మవారికి కూరగాయలు, పండ్లు, పూలతో అలంకరింప చేశారు. మహిళలు సామూహికంగా చీర, సారెతో పాటు వడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. వరుణ దేవుడు కరుణించాలంటూ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు

కోట్ల సుజాతమ్మకు పదవి ఇవ్వాలి

● వెంకటనాయునిపల్లె సర్పంచ్ చంద్రశేఖర్ నాయుడు

డోన్ రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మకు పార్టీ అధిష్టానం రాష్ట్ర స్థాయిలో సముచిత పదవి ఇవ్వాలని వెంకటనాయునిపల్లె గ్రామ సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు కోరారు. ఆదివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న కోట్ల సుజాతమ్మ వివిధ కారణాలతో తన స్థానాన్ని త్యాగం చేసి డోన్‌లో టీడీపీని గెలిపించేందుకు శ్రమించిందన్నారు. ఆమె సేవలను గుర్తించి పార్టీ అధిష్టానం రాష్ట్ర స్థాయిలో సముచిత నామినేటెడ్ పదవిని కేటాయించాలని కోరారు. సమావేశంలో నాయకులు జలదుర్గం కృష్ణ, రామయ్య, బాలరాజు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే న్యాయం

● పెన్షనర్ల సంఘం నాయకులు

డోన్ రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే పెన్షనర్ల సమస్యలకు పరిష్కారం లభించి న్యాయం జరుగుతుందని పెన్షనర్ల సంఘం సహాయ అధ్యక్షుడు సుబ్బరాయుడు, కార్యదర్శి గాలయ్య అన్నారు. ఆదివారం పెన్షనర్ల సంఘం కార్యాలయంలో సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇటీవల పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు శంకరయ్య, సంజీవరెడ్డి, మాణిక్యంశెట్టి, రాంభూపాల్‌రెడ్డి, రాజేశ్వరిను సన్మానించారు. పెన్షనర్లకు రావాల్సిన డీఆర్ బకాయిలను ప్రభుత్వం మంజూరుచేయాలని కోరారు. సమావేశంలో పెన్షనర్ల సంఘం నాయకులు నరసింహులు, గోపాల్, రామదాసురెడ్డి, రామకృష్ణారెడ్డి, రామచంద్రుడు, సుబ్రహ్మణ్యం, రామాంజనేయులు, మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి

డోన్ రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో ఈ నెల 16న నిర్వహించనున్న ఆర్‌ఎంపీల జిల్లా మహాసభను జయప్రదం చేయాలని గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్షుడు కొచ్చెర్వు వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం డోన్ ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం నాయకులు (ఆర్‌ఎంపీ) బాలసుబ్బయ్య, బాషా, ప్రవీణ్ కుమార్, అంజి, మౌలాలి, ఏవీ ఆచారి, జయచంద్ర, గురునాథ్, వెంకటస్వామి, బాలమద్దయ్య పాల్గొన్నారు.

శ్మశాన స్థలం పరిశీలన



శ్మశాన స్థలాన్ని పరిశీలిస్తున్న వీఆర్ లక్ష్మీరెడ్డి

కొలిమిగుండ్ల, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో ముస్లింలకు ఏర్పాటు చేసిన శ్మశాన వాటిక స్థలాన్ని టీడీపీ నియోజకవర్గ కోకన్వీనర్ వీఆర్ లక్ష్మీరెడ్డి పరిశీలించారు. ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే పరిష్కరించారని లక్ష్మీరెడ్డి తెలిపారు. కార్య క్రమంలో టీడీపీ నాయకులు వెంకటమల్లారెడ్డి, సర్పంచ్ శివ శంకర్, ఓబులేషు, ఉపసర్పంచ్ రామలక్ష్మణ్ణ, కుల్లాయప్ప, పెద్దన్న పాల్గొన్నారు.


పకడ్బందీగా గ్రామసభలు నిర్వహించాలి

చాగలమర్రి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ సామాజిక తనిఖీలో భాగంగా గ్రామసభలను డీఆర్పీ పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర రిసోర్స్ పర్సన్ భాస్కర్ తెలిపారు. ఆదివారం నేలంపాడు, కేపీ తండా, కలుగొట్లపల్లె గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఉపాధి నిధుల ద్వారా చేపట్టిన పనుల వివరాలను సభలో చదివి వినిపించారు. 19 గ్రామ పంచాయతీల్లో 2024-25 సంవత్సరానికి గాను రూ.11కోట్లు నిధులు ఖర్చు చేశారని, ఆనిధులపై గ్రామాల వారీగా విచారణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీవో నిర్మల, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

బనగానపల్లె మార్కెట్‌యార్డు కమిటీ నియామకం

బనగానపల్లె, జూలై 13 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మార్కెట్ యార్డు కమిటీని ఆదివారం టీడీపీ అధిష్టానం అధికారికంగా ప్రకటించింది. మార్కెట్‌యార్డు కమిటీ గౌరవ అధ్యక్షుడిగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, చైర్మన్‌గా కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, వైస్ చైర్మన్‌గా కొండనడిపి భూషన్న, సభ్యులుగా గుండం మల్లికార్జునరెడ్డి, దేశావత్ నర్సిబాయి, దూదేకుల పర్వీన్, గంగిరెడ్డి సుజాత, కూరం రాధిక, మారం పుల్లారెడ్డి, ముచ్చలపురి రమణయ్య, దూదేకుల పెద్దదస్తగిరమ్మ, తెలుగు ఎల్లేశ్వరి, ఎర్రబోలు పవన్‌కుమార్‌రెడ్డి, నల్‌బందు మహబూబ్ బాష, తలారి లక్ష్మీదేవి, మద్దెసాని సరస్వతిలను నియమించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీకి నూతన కమిటీ చైర్మన్, సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుడికి డాక్టరేట్



బషీర్ అహ్మద్

రుద్రవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం ఆదర్శపాఠశాల ఉపాధ్యాయుడు బషీర్ అహ్మద్ డాక్టరేట్ సాధించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసరు రత్నమణి ఆధ్వర్యంలో 'పీర్ తు పీర్ లెర్నింగ్ అండ్ రిమోట్ ఆన్‌లైన్ టీచింగ్ లెర్నింగ్ టూల్స్ టు ఇంప్రూవ్ రైటింగ్ స్కిల్స్ అమాంగ్‌ద అండర్ గ్రాడ్యుటీ లెవల్ స్టూడెంట్స్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ సందర్భంగా ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆదివారం పాఠశాల ప్రిన్సిపాల్ సంగె నాగేశ్వర్‌రావు, టీడీపీ మండల కన్వీనరు ఎల్‌వీ రంగనాయకులు, ఎస్సీ సెల్ ప్రధానకార్యదర్శి కొమ్మలపాటి రాజారావు, టీడీపీ మండల ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్ సన్మానించారు.